
ఖరీదైన సున్నపురాయి నిక్షేపాలను గుట్టుగా దోచేస్తున్నారు. వారం కిందట కొత్త మల్లవల్లిలో భారీ ఎత్తున సున్నపురాయి నిక్షేపాలు బయటపడగా, రహస్యంగా ఉంచిన ప్రైవేట్ వ్యక్తులు గుట్టుచప్పుడు కాకుండా అర్ధరాత్రుళ్లు తవ్వకాలు చేస్తున్నారు. అత్యంత ఖరీదైన ఈ రాయిని గుడివాడ, బందరుకు తరలిస్తున్నారు. ఈ ప్రైవేటు వ్యక్తుల్లో చాలామంది కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో అక్రమ మైనింగ్ చేసినవారు కాగా, మరికొందరు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి గొడుగు పట్టేవారు.





కొత్త మల్లవల్లిలో సున్నపురాయి తవ్వకాలు (ఇన్‌సెట్‌లో) గ్రావెల్ ముసుగులో లారీలో సున్నపురాయి రవాణా

గుట్టుగా..

సున్నపురాయి తరలింపు | కొత్త మల్లవల్లిలో బయటపడిన ఖనిజాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ /జంక్షన్ రూరల్) : కొత్త మల్లవల్లి సర్వే నెంబర్ 165, 166లో మొత్తం 12 ఎకరాల విస్తీర్ణంలో సున్నపురాయి నిక్షేపాలు బయటపడ్డాయి. ఈ ప్రాంతంలో ఎప్పటినుంచో అర్ధరాత్రుళ్లు అనధికారికంగా మైనింగ్ జరుపుతున్న ప్రైవేట్ వ్యక్తుల కంట ఇవి పడ్డాయి. ప్రస్తుత పారిశ్రామికవాడ ఉన్న మల్లవల్లి నుంచి లోపలికి వెళ్తే.. ఈ కొత్త మల్లవల్లి వస్తుంది. ఇక్కడ ఏం జరుగుతుందో బయటి వారికి తెలియదు. పొలాల మీదుగా ఉన్న చిన్నదారిలో ఇక్కడికి వెళ్లాల్సి ఉంటుంది. ఇలాంటి ప్రాంతంలో సున్నపురాయి నిక్షేపాలను మైనింగ్ మాఫియా కనుగొంది. ఇక్కడ గ్రావెల్ నిక్షేపాలను చాలాకాలంగా తవ్వుతున్నారు. తవ్వగా తవ్వగా సున్నపురాయి బయటపడింది. అయితే, విషయం బయటకు పొక్కకుండా ప్రైవేట్ వ్యక్తులు ప్రణాళికలు రచించుకున్నారు. సరైన దారి లేకపోవడంతో ట్రాక్టర్లను పంపి సున్నపురాయిని తెప్పిస్తున్నారు. పైన పరదా కప్పి, దానిపై గ్రావెల్ వేస్తున్నారు. ఈ ట్రాక్టర్లన్నింటినీ మల్లవల్లి

బయటకు రానివ్వకుండా తవ్వుతున్న ప్రైవేట్ వ్యక్తులు

- 12 ఎకరాల్లోని రాయి అర్ధరాత్రి తరలింపు
- పెద్ద టిప్పర్లలో గుడివాడ, బందరుకు..
- అక్కడి నుంచి సరిహద్దులు దాటింపు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

పారిశ్రామికవాడ వద్ద వంద అడుగుల రోడ్డుకు సమీపంలోని పొలాల్లోకి తీసుకొచ్చి పరదాలను తొలగిస్తున్నారు. ఆ తర్వాత పెద్ద టిప్పర్లలోకి సున్నపురాయిని లోడ్ చేస్తున్నారు. ఇలా గుట్టుచప్పుడు కాకుండా బయటకు పంపుతున్నారు.

రూ.కోట్లలో ఆదాయం

సున్నపురాయి ఎంతో విలువైనది. సున్నం తయారీయే కాకుండా వైద్యపరంగా అనేక రకాలుగా ఇది ఉపయోగపడుతుంది. దాదాపు 70 రకాల ఆరోగ్య సమస్యలకు ఇది పరిష్కారం చూపుతుందన్న ప్రచారం ఉంది. ఫలితంగా దీనికి విలువ ఎక్కువ. టన్ను ముడి సున్నపురాయిని తవ్వి అమ్ముకుంటే రూ.50 వేల వరకు వస్తాయి. ఓ పెద్ద టిప్పర్‌లో 25 నుంచి 35 టన్నుల వరకు తరలించవచ్చు. పెద్ద టిప్పర్‌కు రూ.12 లక్షల నుంచి రూ.17.50 లక్షల వరకు ఆదాయం వస్తుంది. వందల సంఖ్యలో తరలిస్తున్న ఈ సున్నపురాయి ద్వారా రూ.కోట్లలో సంపాదించవచ్చు.


పట్టని అధికారులు

వారం రోజులుగా సున్నపురాయి నిక్షేపాలను ప్రైవేట్ వ్యక్తులు గుడివాడ, బందరుకు రహస్యంగా తరలిస్తున్నారు. అక్కడి నుంచి ట్రేడర్ల ద్వారా సరిహద్దులు దాటిస్తున్నారని తెలుస్తోంది. ఇంతా జరుగుతున్నా రెవెన్యూ యంత్రాంగానికి కానీ, మైనింగ్ శాఖ అధికారులకు కానీ తెలియకపోవటం గమనార్హం. ఈ వ్యవహారంపై కలెక్టర్ సమగ్ర విచారణకు ఆదేశించటంతో పాటు సున్నపురాయి నిక్షేపాలు ఉన్న ప్రాంతాన్ని మైనింగ్ శాఖ ద్వారా తమ ఆధీనంలోకి తీసుకునేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

సత్యం సుందరం



'సత్యం సుందరం' సినిమా విజయోత్సవంలో భాగంగా హీరో కార్తీ సోమవారం నగరంలో సందడి చేశారు. దుర్గమ్మను దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు.



పట్టభద్రుల ఓటు నమోదు నేటి నుంచే

ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందడి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు నగారా మోగనుండటంతో పట్టభద్రుల ఓట్ల నమోదుకు రంగం సిద్ధమైంది. మార్చి 2025లో నిర్వహించనున్న ఎన్నికలను పురస్కరించుకుని పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడం కోసం మంగళవారం నుంచి నవంబరు 6వ తేదీ లోపు ఓటర్లుగా నమోదు చేసుకోవటానికి అవకాశం కల్పించింది. నవంబరు 20వ తేదీన ముసాయిదా ఓటరు జాబితా ముద్రించి 23వ తేదీన ప్రచురిస్తారు. ముసాయిదా ఓటరు జాబితాపై డిసెంబరు 9 వరకు అభ్యంతరాలు స్వీకరించి 25వ తేదీ నాటికి పరిష్కరించి తుది ఓటరు జాబితా డిసెంబరు 30వ తేదీన ప్రకటిస్తారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సాధారణ ఎన్నికల మాదిరిగా పాత ఓటర్ల జాబితా ఉండదు. ఎప్పటికప్పుడు ఓటర్లుగా నమోదు కావాల్సి ఉంటుంది. అర్హులైన పట్టభద్రులంతా కూడా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. దీని కోసం ఫాం-18 దరఖాస్తును సమర్పించాల్సి ఉంది. దరఖాస్తులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో కూడా చేసుకోవచ్చు. ఫాం- 18తో పాటు గ్రాడ్యుయేట్ డిగ్రీ ప్రొవిజినల్ సర్టిఫికెట్ ఒరిజినల్

- మార్చి 2025లో నిర్వహించనున్న ఎన్నికల సంఘం
- ఫాం-18తో ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలి

అటెస్టెడ్ జిరాక్స్ కాపీ, ఫొటో, ఆధార్ కార్డు కాపీ, ఓటరు ఐడీని జత చేయాల్సి ఉంటుంది. ఇలా జత చేసిన వాటిని స్థానిక తహశీల్దార్ కార్యాలయాలలో అందించాల్సి ఉంది. పట్టభద్రుల ఓటరు నమోదు కోసం ఆన్‌లైన్ విధానంలో కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసినపుడు వెరిఫికేషన్ కోసం ఇంటికి వచ్చిన పుడు సర్టిఫికెట్లు చూపించాల్సి ఉంటుంది. ఓటు నమోదు చేయించుకోవడానికి అక్టోబరు 2021 నాటికి పట్టభద్రులు అయి ఉండాలి. ఇంజినీరింగ్, మెడిసిన్, సీఏ, ఇతర పీజీ డిప్లొమా పూర్తి చేసిన వారు కూడా ఓటు హక్కు నమోదు చేసుకోవటానికి అర్హులే. అయితే వీరంతా రూడా పది + ఇంటర్ + డిగ్రీ పద్ధతిలో పూర్తి చేసి ఉన్న వారు మాత్రమే అర్హులు. పదవ తరగతి తర్వాత దూరవిద్యలో డిగ్రీ పూర్తి చేసిన వారు అనర్హుల జాబితాలోకి వస్తారు.



బోల్తా పడిన లారీ

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం



ఇనుప రాడ్డుల కింద డ్రైవర్ షేక్ ఖాదర్ బాషా మృతదేహం

- ఒకరికి తీవ్ర గాయాలు
- చల్లపల్లి మండలం నూకలవారిపాలెంలో ఘటన
- మృతుల్లో నెల్లూరు జిల్లాకు చెందిన లారీ డ్రైవర్, యాచకుడు

చల్లపల్లి, సెప్టెంబరు 30 : కృష్ణాజిల్లా చల్లపల్లి మండలం నూకలవారిపాలెంలో 216 జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. నెల్లూరు జిల్లా కందుకూరుకు చెందిన లారీలో ఇనుము, స్టీలు రాడ్డులను ఒరిస్సా నుంచి చెన్నై తీసుకువెళుతున్నారు. కందుకూరుకు చెందిన లారీ డ్రైవర్ షేక్ ఖాదర్ బాషా(41)కు తెల్లవారుజామున నిద్ర రావటంతో లారీపైన పడుకున్నాడు. క్లీనర్ షేక్ బాబు లారీ నడుపుతున్నాడు. నూకలవారిపాలెం అడ్డరోడ్డు సమీపంలో జాతీయ రహదారిపైకి ఒక్కసారిగా యాచకుడు రావడంతో లారీ అతన్ని ఢీకొని అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీపైన పడుకుని ఉన్న డ్రైవర్ ఖాదర్ బాషా ఇనుపరాడ్డుల కింద నలిగి అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ నడుపుతున్న బాబుకు కాళ్లు విరిగాయి. లారీ ఢీకొనటంతో యాచకుడు మృతి చెందాడు.

సమాచారం అందుకున్న పోలీసులు సోమవారం క్రేన్‌ల సహాయంతో లారీని పైకితీసి ఇనుప రాడ్డుల కింద పడి ఉన్న డ్రైవర్ ఖాదర్ బాషా మృతదేహాన్ని బయటకుతీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఖాదర్ బాషా సోదరుని కుమారుడు షేక్ ఫయాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చల్లపల్లి ఎస్ఐ పి.ఎస్.వి.సుబ్రహ్మణ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కృష్ణ.. కృష్ణా ఇవేం పీహెచ్‌డీలు?

ఐదేళ్ల వైసీపీ పాలనలో అక్రమాలు, వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా కృష్ణా యూనివర్సిటీ నిలిచింది. 2021లోనే రద్దు చేసిన జర్నలిజం కోర్సులో తాజాగా ముగ్గురికి పీహెచ్‌డీలు ప్రదానం చేసి కొత్త చరిత్రను లిఖించింది. నియమ నిబంధనలను తుంగలో తొక్కింది. దీనిపై ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రులకు ఫిర్యాదులు అందడంతో సమగ్ర విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది.

కృష్ణాయూనివర్సిటీలో పీహెచ్‌డీల ప్రదానంలో అక్రమాలు

- 2021లోనే రద్దయిన జర్నలిజం కోర్సు
- 2023, 2024లో ముగ్గురికి ఈ కోర్సులో పీహెచ్‌డీల ప్రదానం
- దీనిపై సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు అందిన ఫిర్యాదులు
- విచారణకు ఆదేశించిన రాష్ట్ర ప్రభుత్వం



కృష్ణా యూనివర్సిటీ

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : 'కృష్ణా యూనివర్సిటీలో జర్నలిజం కోర్సును 2021 జూన్ 17వ తేదీన మూసి వేశారు. ఈ కోర్సును రద్దు చేసే నాటికి ముగ్గురు అధ్యాపకులు ఈ విభాగంలో పనిచేస్తున్నారు. వీరిలో ఇద్దరు అధ్యాపకులు ఆంధ్రా యూనివర్సిటీకి వెళ్లిపోగా, ఒకరు నాగార్జున యూనివర్సిటీకి వెళ్లారు. అయితే 2023, 2024 సంవత్సరాల్లో ముగ్గురికి పీహెచ్‌డీలను ప్రదానం చేశారు. వీరిలో ఒకరు ఓ దిన పత్రిక (ఆంధ్రజ్యోతి కాదు)లో పని చేస్తున్నారు. సంబంధిత పత్రాలపై జర్నలిజం అండ్ మాస్ కమ్యునికేషన్ విభాగంలో ఆంధ్రా యూనివర్సిటీలో పనిచేస్తున్న సీఎం వినయ్‌కుమార్, విజయలక్ష్మి సంతకాలు చేశారు. 2023లో జ్యోతిర్మయి అనే అధ్యాపకురాలు మరో విద్యార్థికి ఎంఫిల్ నుంచి పీహెచ్‌డీకి మార్చారు. అయితే సాధారణంగా పీహెచ్‌డీ చేసిన విద్యార్థులు సమర్పించిన పత్రాలను వివిధ యూనివర్సిటీలకు సంబంధించిన రీసెర్చ్ రివ్యూ కమిటీ నిపుణులు నాలుగు విడతల్లో పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేస్తేనే పీహెచ్‌డీ పట్టాను మంజూరు చేసేందుకు అవకాశం ఉంటుంది. కానీ నిబంధనలకు విరుద్ధంగా జరిగిన ఈ పీహెచ్‌డీల ప్రదానంపై' ఆంధ్రా యూనివర్సిటీ మాజీ పోస్ట్ డాక్టోరల్‌ఫెలో, మాజీ గెస్ట్ ఫ్యాకల్టీ డాక్టర్ జీకేడీ ప్రసాద్, మరికొందరు ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మానవవనరుల శాఖామంత్రి నారా లోకేశ్‌కు సమగ్ర వివరాలు, ఆధారాలతో సెప్టెంబర్ 28వ తేదీన ఫిర్యాదు చేశారు.

వినయ్‌కుమార్ బదిలీనే అక్రమం

కృష్ణా యూనివర్సిటీ నుంచి ఆంధ్రా యూనివర్సిటీకి వినయ్‌కుమార్ బదిలీ కావడమే అక్రమమని, ఓ దిన పత్రిక(ఆంధ్రజ్యోతి కాదు)లో పని చేస్తున్న విద్యార్థి పీహెచ్‌డీ కోసం దరఖాస్తు చేసుకున్న మూడు వారాల వ్యవధిలోనే ఆయనకు వైవావోస్‌ను నిర్వహించి చకచకా పీహెచ్‌డీ పట్టాను అందజేయడంలో అప్పటి ప్రభుత్వం పాత్ర ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. వినయ్‌కుమార్ అసలు జర్నలిజం కోర్సు లేని కృష్ణా యూనివర్సిటీలో పీహెచ్‌డీ సూపర్‌వైజర్‌గా సంతకం చేయడం మరీ విడ్డూరమని తెలిపారు. ఈ అంశంపై పూర్తిస్థాయి విచారణ చేయాలని వారు వినతిపత్రంలో కోరారు. 2010 నుంచి కృష్ణా యూనివర్సిటీలో జర్నలిజం కోర్సులో మొత్తం 19 మంది పీహెచ్‌డీ చేస్తుండగా, ముగ్గురికి మాత్రం పట్టాలు ఇచ్చి మిగిలినవారికి ఇవ్వకుండా జాప్యం చేయడం గమనార్హం. దీనిపై గవర్నర్, ఉన్నత విద్యామండలి అధికారులకు నేటికీ ఫిర్యాదులు చేస్తుండటం విశేషం.

పీహెచ్‌డీ పట్టా అందక విద్యార్థిని బలవన్మరణం

భీమవరానికి చెందిన పి.అమిత అనే స్కాలర్ భీమవరంలోని ఓ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తూ కృష్ణా యూనివర్సిటీలో కామర్స్ విభాగంలో పీహెచ్‌డీని పూర్తి చేశారు. పీహెచ్‌డీకి సంబంధించి పరిశోధనా పత్రాలను 2022 నవంబరు 14వ తేదీన ఆమె సమర్పించారు. పీహెచ్‌డీ చేసినందుకు గాను యూనివర్సిటీకి రూ.1.49 లక్షలను ఫీజుగా కూడా ఆమె చెల్లించారు. పరిశోధనా పత్రాలను సమర్పించి 14 నెలలు గడచినా ఆమెకు పీహెచ్‌డీని ప్రదానం చేయలేదు. దీంతో ఏడాది వ్యవధిలో ఆమె మూడు విడతలుగా తన పరిశోధనా పత్రాలను సమర్పించి, తనకు పట్టాను అందజేయాలని యూనివర్సిటీ అధికారులను పలుమార్లు కోరారు. అయినా యూనివర్సిటీ రీసెర్చ్ విభాగం అధికారులు ఈ విషయాన్ని పక్కనపెట్టేశారు. పీహెచ్‌డీ పట్టా తెచ్చుకోవాలని, పీహెచ్‌డీ వచ్చిన తర్వాతే మళ్లీ ఉద్యోగం ఇస్తామని చెప్పి సదరు కళాశాల నుంచి అమితను పంపేశారు. పీహెచ్‌డీ పట్టాలేని కారణంగా ఉద్యోగం నుంచి తొలగించడంతో ఆమె తీవ్ర మనస్తాపానికి గురై గతేడాది నవంబరులో బలవన్మరణానికి పాల్పడింది. ఇంతా జరిగినా యూనివర్సిటీ అధికారులు ఈ విషయాన్ని అసలు పట్టించుకోలేదు. ఈ అంశంపై అధ్యాపకులంతా అప్పట్లో ఆందోళన చేసినా వర్సిటీ నుంచి స్పందనలేదు.

ప్రభుత్వానికి నివేదిక పంపుతాం

కృష్ణా యూనివర్సిటీలో జర్నలిజం కోర్సును రద్దు చేసిన తర్వాత పీహెచ్‌డీల ప్రదానంపై విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. ఇటీవలనే రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్నా. ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఈ అంశంపై పూర్తిస్థాయి నివేదికను పంపాలని యూనివర్సిటీ వీసీ ఆదేశించారు. పీహెచ్‌డీ విద్యార్థులు సమర్పించిన థీసిస్‌ను రీసెర్చ్ రివ్యూ కమిటీ నాలుగు సార్లు పరిశీలించాలి. ఓ పత్రిక(ఆంధ్రజ్యోతి కాదు)లో పనిచేస్తున్న వ్యక్తి సమర్పించిన థీసిస్‌ను రీసెర్చ్ రివ్యూ కమిటీ రెండు సార్లు మాత్రమే పరిశీలన చేసినట్లుగా రికార్డులలో ఉంది. జర్నలిజం కోర్సును రద్దు చేసిన తర్వాత వేరే యూనివర్సిటీలకు వెళ్లిన అధ్యాపకులు, లేదా గైడ్‌లు పీహెచ్‌డీ పట్టాలను ఇవ్వాలని సిఫార్సు చేయడం నిబంధనలకు విరుద్ధం. గతంలో జరిగిన అవకతవకలపై పూర్తిస్థాయి విచారణ జరిపి వివరాలతో ప్రభుత్వానికి నివేదిస్తాం.

-డాక్టర్ చెరుకూరి జయశంకరప్రసాద్, రీసెర్చ్ విభాగం డైరెక్టర్, కృష్ణాయూనివర్సిటీ

మీకోసం అర్జీలు పెండింగ్ పెట్టొద్దు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ

- కలెక్టర్ బాలాజీ
- జేసీ గీతాంజలిశర్మ, డీఆర్వో చంద్రశేఖర రావుతో కలిసి అర్జీల స్వీకరణ
- సమస్యల పరిష్కారం కోరుతూ 140 మంది అర్జీల అందజేత

6లో

పర్యావరణ పరిరక్షణపై దృష్టి పెట్టండి

- మంత్రి కొల్లు రవీంద్ర

6లో



హుండీల ఆదాయం లెక్కిస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది

కనకదుర్గమ్మ హుండీల ఆదాయం రూ.2.05 కోట్లు

వన్‌టౌన్, సెప్టెంబరు 30 : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించారు. 18 రోజుల వ్యవధికిగాను కానుకల రూపేణ మొత్తంగా రూ.2,05,75,378లు నగదు లభించింది. 266 గ్రాముల బంగారం, 5కిలోల 562 గ్రాములు వెండి సమకూరింది. వివిధ దేశాల కరెన్సీ కూడా హుండీలలో లభ్యమైంది. 568 యుఎస్‌ఏ డాలర్లు, 185 అరబ్ ఎమిరేట్స్ దీర్హాలు, ఒమెన్ రియాల్స్ 31, 2,500 నైజీరియా నైరాలు, 35 మలేషియా రింగెట్లు, 20 ఇంగ్లండ్ పౌండ్లు, 45 కెనడా డాలర్లు, 1 కువైట్ దీనార్, 5 సౌదీ రియాల్స్, 10 స్కాట్‌ల్యాండ్ పౌండ్లు, 30 ఇంగ్లండ్ డాలర్లు, 50 ఆస్ట్రేలియా డాలర్లు, 110 సింగపూర్ డాలర్లు, 10 మాల్దీవులు రుఫియాలు, 118 కతార్ రియాల్స్ చొప్పున విదేశీ కరెన్సీ వచ్చింది. ఆన్‌లైన్ హుండీ ద్వారా మరో రూ.75,396లు భక్తులు సమర్పించారు. డిప్యూటీ ఈవో రత్నరాజు, దేవదాయ అధికారులు, ఏఈవోలు, సిబ్బంది, ఎస్‌పిఎఫ్, వన్‌టౌన్ పోలీసు సిబ్బంది, అమ్మవారి సేవాదారులు లెక్కింపులో పాల్గొన్నారు.



ఆంజనేయస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న కూటమి నేతలు

ఆంజనేయ ఆలయంలో ప్రాయశ్చిత్త పూజలు

అవనిగడ్డ : కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వరస్వామి ఆలయ పవిత్రతను దెబ్బతీసేలా వ్యవహరించిన వైసీపీ ప్రభుత్వ, నాటి టీటీడీ పాలక మండలి తప్పులకు ప్రాయశ్చిత్తంగా రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాల్లో పూజలు చేయాలని పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు అవనిగడ్డలో ఎమ్మెల్యే మండలి బుద్దప్రసాద్ సతీమణి, కూటమి నేతలు అవనిగడ్డ ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రాయశ్చిత్త పూజలు నిర్వహించారు. ఆలయంలో సోమవారం సాయంత్రం ప్రత్యేకపూజలు నిర్వహించి దోష పరిహారార్థం దీపాలు వెలిగించి ఆంజనేయ స్వామికి నివేదించారు. తిరుమల పవిత్రతను దెబ్బతీసేలా వ్యవహరించిన నాటి వైసీపీ ప్రభుత్వ, టీటీడీ పాలకమండలి, ఈవో వ్యవహార శైలిపై కూటమి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అవనిగడ్డ మాజీ ఎంపీపీ బండే నాగ వెంకట కనకదుర్గ, కూటమి నేతలు కొల్లూరి వెంకటేశ్వరరావు, మత్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

పర్యావరణ పరిరక్షణపై దృష్టి పెట్టండి

» మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 30 : పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. జిల్లాలోని పలుప్రాంతాల్లో సేకరించిన ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సోమవారం బందరు మండలం పోతేపల్లిలో నిల్వ ఉంచారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాల వల్ల పర్యావరణం కలుషితమవుతుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని ఎంపిక చేసిన పంచాయతీల్లో కియోస్క్ సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 11 టన్నుల ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించడం జరిగిందన్నారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ, ఎలక్ట్రానిక్స్ వస్తువుల ఉత్పత్తిదారుడే వ్యర్థాల రీసైక్లింగ్‌కు కావలసిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. జడ్పీ సీఈవో కన్నమనాయుడు, సుమన్ డీపీవో జె.అరుణ, ఎంపీడీవో ఎ.బాలకృష్ణారావు తదితరులు పాలొన్నారు. అనంతరం కలెక్టర్ బాలాజీకి మంత్రి ప్రశంసాపత్రం అందజేశారు. పోతేపల్లి పంచాయతీకి దోమల నివారణ ఫాగింగ్ యంత్రాన్ని, ఇద్దరు మహిళలకు ఇన్సూరెన్స్ సొమ్మును అందజేశారు.

దోషులను వదిలిపెట్టేది లేదు..

ఉయ్యూరు : వైసీపీ నాయకుల దోపిడీతో జిల్లా బలైపోయిందని మంత్రి కొల్లు రవీంద్ర ఆందోళన వ్యక్తంచేశారు. గండిగుంటలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ నాయకులు వంశీ, పేర్ని నాని వంటి మరి కొంతమంది అక్రమ దోపిడీ వల్ల జిల్లా అభివృద్ధికి నోచుకోక అధోగతిపాలైందన్నారు. దోషులను ఎవరినీ వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు.



ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న మహిళలు

కొలికపూడిపై కఠిన చర్యలు తీసుకోవాలి

చిట్యాల(తిరువూరు)సెప్టెంబరు 30 : స్థానిక ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పై ముఖ్యమంత్రి చంద్రబాబు తక్షణం కఠిన చర్యలు తీసుకోవాలని మహిళలు డిమాండ్ చేశారు. సోమవారం చిట్యాల గ్రామంలో మహిళలు ఆందోళన చేపట్టారు. ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు, మహిళలపట్ల ఆయన వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా ఖండించారు. మహిళలకు ఫోన్‌ల ద్వారా అసభ్యకరమైన మెసేజ్‌లు పంపుతున్నట్టు వారు ఆరోపించారు. తాము పార్టీకోసం కష్టపడుతుంటే, ఎమ్మెల్యే పార్టీకి చెందిన వారినే వేధింపులకు గురి చేస్తున్నాడని విమర్శించారు. కొలికపూడిపై కఠిన చర్యలు తీసుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

నిబంధనల మేరకే అద్దెకు షాపులు

విద్యాధరపురం, సెప్టెంబరు 30 : గొల్లపూడి మార్కెట్ యార్డులో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌లోని షాపులను ప్రభుత్వ నిబంధనల ప్రకారమే అర్హులైన వారికి అద్దెలకు కేటాయిస్తామని ప్రాంతీయ ఉప సంచాలకులు దివాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొంతమంది బ్రోకర్లు షాపులను కొనుగోలు చేయిస్తామని, లీజులకు ఇప్పిస్తామని మభ్యపెడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. గొల్లపూడి మార్కెట్ యార్డుకు దక్షిణం వైపున ఉన్న జాతీయ రహదారి పక్కన నిర్మిస్తున్న షాపులు, తూర్పువైపున నిర్మిస్తున్న షాపులకు ప్రభుత్వ నిబంధనలకు ప్రకారమే అద్దెలకు ఇచ్చేందుకు ప్రకటనలు జారీ చేస్తామన్నారు. ప్రకటనల మేరకు అర్హులైన వారికి మాత్రమే షాపులు కేటాయిస్తామని, మధ్యవర్తులను, బ్రోకర్లను నమ్మి మోసపోవద్దని తెలిపారు.



గుర్తింపు కార్డు లేకుంటే టికెట్ తీసుకోనట్టే!

» ఆ ప్రకారం జరిమానాలకు సిద్ధం

» ప్రయాణికులకు విజయవాడ డివిజన్ ఆదేశం

» టికెట్ బదిలీలను నిరోధించటానికి అధికారుల నిర్ణయం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రైళ్లలో ప్రయాణించాలంటే ఇకపై తప్పనిసరిగా ప్రయాణికులు గుర్తింపు కార్డును వెంట తీసుకు వెళ్లాల్సిందే.. ఒకవేళ గుర్తింపు కార్డు వెంట తీసుకువెళ్లకపోతే టికెట్ తీసుకోని వారి కింద రైల్వే పరిగణిస్తుంది. అట్టివారిపై జరిమానా కూడా విధిస్తుంది. బుకింగ్ సమయంలో ఇచ్చిన వివరాలకు, ఆ తర్వాత ప్రయాణిస్తున్న వారి వివరాలు సరిపోలకపోవటం వంటి సమస్యల కారణంగా రైల్వే శాఖ ఈ నిర్ణయం తీసుకున్నట్టు విజయవాడ డివిజన్ అధికారులు సోమవారం ప్రకటించారు. అనధికారిక టిక్కెట్లను నియంత్రించటానికి, టిక్కెట్ బదిలీలను నిరోధించటానికి, ప్రయాణం సాఫీగా జరిగేందుకు దోహదపడేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. విజయవాడ డివిజన్ పరిధిలోని రైలు ప్రయాణికులు విధిగా తమ వెంట గుర్తింపు కార్డును తీసుకు రావాల్సిందేనన్నారు. ప్రయాణికులు తమ వెంట తీసుకు వచ్చే గుర్తింపు కార్డులకు సంబంధించి కార్డులను నిర్దేశించటం జరిగింది. వీటిలో ఏదో ఒకటి తమ వెంట తీసుకువెళ్లాల్సిందే.



రైల్వే నిర్దేశించిన గుర్తింపు కార్డులు ఇవే..

1. ఓటరు గుర్తింపు కార్డు, 2. పాస్‌పోర్ట్, 3. పాన్‌కార్డు, 4.డ్రైవింగ్ లైసెన్స్, 5.రేషన్ కార్డు, 6. విద్యాసంస్థలు విద్యార్థులకిచ్చే గుర్తింపు కార్డులు, 7. ఏదైనా జాతీయ బ్యాంకు పాస్‌బుక్, 8.క్రెడిట్ కార్డ్, 9. ఆధార్ కార్డు, 10. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డులు, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డులు, జిల్లా యంత్రాంగం, కార్పొరేషన్, మునిసిపాలిటీలు, పంచాయితీలు జారీ చేసిన గుర్తింపు కార్డులు, 11. బార్ కౌన్సిల్ జారీ చేసిన గుర్తింపు కార్డు.

కుటుంబం యూనిట్‌గా ఆర్థిక సాయం

» అధికారులకు సహకరించాలి

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

కృష్ణలంక, సెప్టెంబరు 30 : రాష్ట్ర ప్రభుత్వం ముంపు ప్రభావిత బాధితులకు కుటుంబం యూనిట్‌గా ఆర్థిక సహాయాన్ని అందిస్తోందని, కుటుంబంలో ఒకరిని గురించి, వారి ఆధార్‌కు అనుసంధానమైన బ్యాంకు ఖాతాలో డీబీటీ ద్వారా నగదు జమచేయడం జరుగుతోందని కలెక్టర్ జి.సృజన సోమవారం తెలిపారు. కుటుంబంలో మరో వ్యక్తిని లబ్ధిదారునిగా గుర్తించడానికి వీలులేని విషయాన్ని గుర్తించాలని, అనవసరంగా అర్జీలు దాఖలు చేయొద్దని సూచించారు. బాధితులకు అత్యంత పారదర్శకంగా సహాయం అందించడం జరుగుతోందని, ఇప్పటివరకు ఇళ్లు, వాహనాలు తదితర నష్టాలకు సంబంధించి 1,12,481 మంది బ్యాంకు ఖాతాల్లో సాయం జమచేయడం జరిగిందన్నారు.



ఆధార్‌తో బ్యాంక్ ఖాతా అనుసంధానించుకోండి..

ఎన్యూమరేషన్ జరిగి, గుర్తించిన లబ్ధిదారులందరికీ ప్రభుత్వం పరిహారం మంజూరు చేసిందని అయితే ఆధార్‌తో బ్యాంక్ ఖాతా లింక్ కాకపోవడం, వినియోగంలో లేకపోవడం తదితర కారణాల వల్ల దాదాపు 20 వేలమంది ఖాతాల్లో నగదు జమకాలేదని వివరించారు. ఈ విషయాన్ని ఎస్ఎంఎస్ ద్వారా లబ్ధిదారుల ఫోన్‌లకు సమాచారం ఇచ్చామన్నారు. అందువల్ల సత్వరమే ఆధార్‌కు బ్యాంకుఖాతాను అనుసంధానం చేసుకొని వినియోగంలోకి తెచ్చుకోవాలని సూచించారు. ఈ విషయమై బ్యాంకులకు కూడా సూచనలిచ్చామని, సచివాలయ సిబ్బంది కూడా బాధితులకు సహకారం అందిస్తారని తెలిపారు. అర్హత పొందిన లబ్ధిదారుల జాబితాలు సచివాలయాలు, తహసీల్దార్ కార్యాలయాల్లో అందుబాటులో వున్నాయని, అక్కడ పేర్లు వుండి ఇంకా పరిహారం జమకాకపోతే ఆధార్‌తో బ్యాంక్ ఖాతా అనుసంధానం కాలేదని గుర్తించి బ్యాంకుఖాతాను ఆధార్‌తో లింక్ చేసుకోవాలని సూచించారు. ఆధార్‌తో అనుసంధానం అయిన రెండురోజులలోపు ఖాతాలో పరిహారం జమచేయడం జరుగుతుందని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఎవరూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని సూచించారు. అదేవిధంగా పరిహారం కోరుతూ గ్రీవెన్స్‌లో సమర్పించిన అర్జీలను క్షుణంగా పరిశీలించి రెండు మూడు రోజుల్లోనే పరిష్కరించి ఆపై అర్హులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.



కోడూరు స్టేషన్ ఆవరణలో వేడుకకు హాజరైన కూటమి నేతలు

ఆమె రూటే వేరు!

» వివాదాస్పదంగా ఎస్ఐ పుట్టిన రోజు వేడుక

అవనిగడ్డ : కోడూరు మండల ఎస్ఐ పి.శిరీష జన్మదిన వేడుకలు వివాదాస్పదంగా మారాయి. శనివారం రాత్రి మండలానికి చెందిన వివిధ పార్టీల రాజకీయ నేతలు స్టేషన్ ఆవరణలో ఎస్ఐ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. భారీ కేక్‌తో పాటు బాణాసంచా పేల్చి సంబరాలు చేశారు. ఆ ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. సర్వీస్ రూల్స్‌కు విరుద్ధంగా పార్టీల నేతలతో స్టేషన్ ఆవరణలో వేడుకలు ఏలా నిర్వహిస్తారంటూ నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. ప్రజాప్రతినిధుల పుట్టిన రోజు వేడుకల్లో అధికారులు పాల్గొని విమర్శలకు గురికావటం పరిపాటి.. కాగా కోడూరులో ఇందుకు విరుద్ధంగా రాజకీయ పక్షాల నేతలతో కలిసి ఎస్ఐ స్టేషన్ ఆవరణలోనే పుట్టిన రోజు వేడుకలు నిర్వహించుకోవటం చర్చనీయాంశమైంది.

మీకోసం అర్జీలు పెండింగ్ పెట్టొద్దు

» అధికారులకు కృష్ణా కలెక్టర్ బాలాజీ ఆదేశం

మచిలీపట్నం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కారవేదిక (మీకోసం) కార్యక్రమంలో ప్రజలనుంచి వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మీకోసం సమావేశపుహాలులో సోమవారం జేసీ గీతాంజలి శర్మ, డీఆర్వో కె.చంద్రశేఖరరావుతో కలిసి ప్రజలనుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లా నలుమూలలనుంచి వచ్చిన 140 మంది సమస్యల పరిష్కారం కోరుతూ అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇప్పటివరకు 3,841 అర్జీలురాగా, వాటిలో 627 ఇంకా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రెవెన్యూ ఐదు, పోలీస్‌శాఖలో ఐదు, జలవనరులశాఖలో ఒకటి గడువుదాటినవి ఉన్నాయన్నారు. వీటిని తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి కార్యాలయంనుంచి వచ్చిన అర్జీలలో డీఎస్‌వోకు సంబంధించి నాలుగు, డీపీవోకు సంబంధించి మూడు పెండింగ్ ఉన్నాయన్నారు. అక్టోబరు ఒకటో తేదీన సామాజిక పింఛన్ల పంపిణీలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సకాలంలో పింఛన్లు అందజేసేందుకు చేసిన ఏర్పాట్లపై డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ అరుణను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. .ఆర్‌డబ్ల్యూఎస్, మునిసిపల్ విభాగాల్లో నాలుగు కోర్టుకేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటికి సరైన వకాలత్‌లను సమర్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కేఆర్‌సీసీ డెప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, జెడ్పీ సీఈవో కన్నమనాయుడు, డీఎస్‌వో పార్వతి, డీఈవో తాహెరాసుల్తానా, వ్యవసాయశాఖ జేడీ పద్మావతి, ఉద్యానశాఖ జేడీ జ్యోతి, డీఎంఅండ్‌హెచ్‌వో గీతాబాయి, అధికారులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు వింటున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

ప్రాధాన్యత క్రమంలో..

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

కృష్ణలంక : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా అందుతున్న అర్జీలకు అధికారులు ప్రాధాన్యతా క్రమంలో పరిష్కారాన్ని చూపాలని కలెక్టర్ జి.సృజన తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో సృజన, పౌరసరఫరాల డీఎం జి.వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ రజనీకుమారితో కలిసి అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి అర్జీని క్షుణంగా పరిశీలించి, అర్జీదారుని సమస్యను సరైన విధంగా అర్థం చేసుకొని పరిష్కరించాలని సూచించారు. గడువులోగా అర్జీలను పరిష్కరించి పెండింగ్ లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి హైలైఫ్ ఎగ్జిబిషన్

విజయవాడ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ నోవాటెల్‌లో హైలైఫ్ ఎగ్జిబిషన్ మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. రెండ్రోజులపాటుఎగ్జిబిషన్ ఉంటుంది. వివిధ రకాల డిజైన్లలో ఉన్న దుస్తువలు, జువెలరీ, హోండెకార్స్ ప్రదర్శనలో ఉంటాయి.

న్యూస్ బాక్స్



వరద బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేస్తున్న ఉప్పలపాటి ఉదయభాస్కర్ రాజు

నిత్యావసరాల పంపిణీ

అజిత్‌సింగ్‌నగర్ : బుడమేరు వరదలతో సర్వస్వం కోల్పోయిన అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం ప్రాంతవాసులకు రైజ్ ఎన్ రైజ్ రియల్ ఎస్టేట్ సంస్థ చైర్మన్ ఉప్పలపాటి విజయభాస్కర్ రాజు నిత్యావసర సరుకులు, ద్విచక్రవాహనాల మరమ్మతుల నిమిత్తం నగదు పంపిణీ చేశారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన 200 మంది బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు, రూ.6 లక్షల నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఉప్పలపాటి మాట్లాడుతూ, వరద బాధితులకు పక్కా ప్రణాళికతో సహాయం అందించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



కలెక్టర్ బాలాజీకి చెక్కు అందజేస్తూ..

సైనికుల నిధికి మెప్మా ఆర్థిక సాయం

మచిలీపట్నం,సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : భారతదేశ రక్షణకోసం దేశసరిహద్దుల వెంబడి ప్రాణాలను పణంగాపెట్టి గస్తీకాస్తున్న సైనికుల సంక్షేమం కోసం ఉమ్మడిజిల్లా మెప్మా సభ్యులు,సిబ్బంది రూ.7,11,867ల ఆర్థికసాయాన్ని కలెక్టర్ బాలాజీకి అందజేశారు. మీకోసం సమావేశపుహాలులో సోమవారం ఈచెక్కును కలెక్టర్‌కు అందజేశారు. మెప్మాపీడీ పి.వెంకటనారాయణ, జిల్లా సైనిక అధికారులు డాక్టర్ కె.కల్యాణివీణ, ఎస్.ఈశ్వర్, మెప్మా సీఎంఎం కేవీఎస్ ఆనందబాబు, మెప్మాసిబ్బంది టి శ్రీనివాస్, టి.రాజమోహన్, వి.సునీల, జి.జ్యోష్ణప్రియ తదితరులు పాల్గొన్నారు.



కొనకళ్లకు నెట్టెం అభినందన

వన్‌టౌన్ : ఆటోనగర్ ఎన్టీఆర్ జిల్లా టీడీపీ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ చైర్మన్‌గా ఎన్నికైన కొనకళ్ల నారాయణను మాజీ మంత్రి, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ దుశ్శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. వాసం మునియ్య, యేదుపాటి రామయ్య సారేపల్లి రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై హోరెత్తిన ధర్నాచౌక్‌లు

» కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీ వెంటనే ప్రారంభించాలి

» మోకాళ్లపై కూర్చుని వినూత్న రీతిలో నిరసన తెలిపిన అభ్యర్థులు

ధర్నాచౌక్ : రెండేళ్ల క్రితం ఇచ్చిన కానిస్టేబుల్ నోటిఫికేషన్ భర్తీ పక్రియను తక్షణమే ప్రారంభించాలని, హోంగార్డు రిజర్వేషన్లు తగ్గించి పాత పద్ధతిలోనే భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడ ధర్నాచౌక్‌లో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కానిస్టేబుల్ అభ్యర్థులు మోకాళ్లపై కూర్చుని సోమవారం వినూత్నరీతిలో నిరసన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన 6100 పోలీస్ కానిస్టేబుల్



నోటిఫికేషన్‌లో 95,208 మంది అభ్యర్థులు రాత పరీక్షలో అర్హత సాధించారని అభ్యర్థులు తెలిపారు. తర్వాత జరగాల్సిన దేహదారుఢ్య, మెయిన్స్ పరీక్షలు ఇప్పటికీ నిర్వహించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం హోంగార్డులకు రిజర్వేషన్ల శాతం పెంచడంతో నిరుద్యోగులకు తీవ్రనష్టం కలుగుతోందన్నారు. భవిష్యత్‌లో నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకుండా కుట్ర చేస్తున్నారని విమర్శించారు. అధికారంలోకి వస్తే ఆరు నెలల్లో సమస్య పరిష్కరిస్తామని 'యువగళం పాతయాత్ర'లో మంత్రి నారా లోకేశ్ తమకు హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అనంతరం టీడీపీ కేంద్రకార్యాలయంలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర నేతలు నాగేశ్వరరావు, కృష్ణ, నిరుద్యోగ అభ్యర్థులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

» సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు

ధర్నాచౌక్ : వివిధ పరిశ్రమలు, ప్రభుత్వశాఖలు, స్థానిక సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని, సమానపనికి సమాన వేతనం, కార్మిక చట్టాల అమలు, రెగ్యులర్ చేయాలనే డిమాండ్లతో ధర్నాచౌక్‌లో సోమవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంట్రాక్టు కార్మికులు ఎలాంటి సంక్షేమ పథకాలకు నోచుకోకుండా, యంత్రాల్లా పనిచేస్తున్నారన్నారు. వీరిని కాంట్రాక్టర్లు దోపిడి చేస్తున్నారన్నారు. కార్మికులకు పనిభద్రత లేకుండా, ఉన్న చట్టాలను అమలు చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యాజమాన్యాలకు తొత్తులుగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. వైసీపీ, టీడీపీ ప్రభుత్వాలు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అన్యాయం చేశాయని విమర్శించారు. రాష్ట్ర నేతలు కేఆర్కే మూర్తి, కె.ఉమామహేశ్వరరావు, ఆర్.వి.నరసింహారావు, ఈవీఎల్.నరసింహులు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరావు, కె.కమల, ఎం.మహేష్, సీహెచ్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.





మచిలీపట్నం లక్ష్మీటాకీస్ సెంటర్‌లో..

మచిలీపట్నం టౌన్ : కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలంటూ సోమవారం సీఐటీయూ కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో లక్ష్మీటాకీసు సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. తొలుత బస్టాండ్ సెంటర్ నుంచి లక్ష్మీటాకీసు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాదాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని చాలాకాలంగా డిమాండ్ చేస్తున్నామన్నారు. ప్రపంచ బ్యాంకు ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులను రెగ్యులర్ చేయడం లేదన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలన్నారు. ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు 62కు పెంచాలని, కారుణ్య నియామకాలు జరపాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.పోలినాయుడు, సుబ్రహ్మణ్యం, జయరావు, ఎం.రాము, ధనికొండ నాగమల్లేశ్వరరావు, దుర్గాప్రసాద్, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



పంట నష్టం నమోదు చేయలేదని రైతుల ధర్నా


పంట నష్టపోయిన రైతుల వివరాలను ఆర్‌బీకే అధికారులు సక్రమంగా నమోదు చేయలేదంటూ మాజేరు గ్రామానికి చెందిన పలువురు రైతులు సోమవారం కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద ఆందోళనకు దిగారు. మాజేరులో 3700 ఎకరాల్లో పంట సాగు చేశారని, అకాల వర్షాల వల్ల 1500 ఎకరాలకు పైగా నష్టం వాటిల్లిందని, అయితే నష్టం నమోదు చేయడంలో ఆర్బీకే అధికారులు తమకు అన్యాయం చేశారని రైతులు వై.గోవిందరాజు, కె.తులసిబాబు, కె.రాఘవరావు, వై.లీలాకృష్ణ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు.

కులగణనలో ఎస్సీ వర్గీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలి : ఎమ్మార్పీఎస్



కులగణనలో ఎస్సీ వర్గీకరణకు ప్రాధాన్యత కల్పించాలంటూ కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద సోమవారం ఎమ్మార్పీఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. జనాభా లెక్కల్లో మాదిగలకు తగిన ప్రాధాన్యత కల్పించాలన్నారు. ధర్నాలో ప్రసాద్ మాదిగ, అరుణకుమార్‌లతో పాటు ఉమ్మడి జిల్లా నేతలు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	123, 132, 143
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 535

రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



విజయవాడ కల్చరల్, సెప్టెంబరు 30 : యనమలకుదురు శ్రీరామ లింగేశ్వరస్వామి వారి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రుద్ర, ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించి, అలంకరణ జరిపారు. పంచహారతులు, పల్లకీసేవ వైభవంగా నిర హించారు. తదుపరి సామూహిక భజన కార్యక్రమం, త్రయోదశి సందర్భంగా ప్రదోష సమయంలో మహానందేశ్వర స్వామికి అభిషేకార్చనలు నిర్వహించారు. కార్యక్రమాలను దేవస్థాన ప్రధాన అర్చకులు జీఆర్‌వీ సాగర్ ప్రర్యవేక్షించారు. సంగా నరసింహారావు ఆధ్వర్యంలో ఉచిత ప్రసాదాలు ఏర్పాటు చేశారు.

అత్తింటి వేధింపులపై ఫిర్యాదు

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 30 : పుట్టింటి నుంచి అదనపు కట్నం తీసుకురావాలని మహిళను మానసికంగా శారీకరంగా వేధిస్తున్న అత్తింటి వారిపై హనుమాన్ జంక్షన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ఎస్సై జనార్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. కె. సీతారాంపురం గ్రామానికి చెందిన మాయర వెంకటేష్‌కు కానుమోలుకు చెందిన పూజితకు 2019లో వివాహమైంది. ఒక పాప, ఒక బాబు ఉన్నారు. ఆడపిల్ల పుట్టినప్పటి నుంచి రూ.5లక్షలు అదనపు కట్నం తీసుకురావలని భర్త, అత్త, మామ, ఆడపడుచు తరుచూ వేధిస్తున్నారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

గన్నవరం, సెప్టెంబరు 30 : గన్నవరం నుంచి పొట్టిపాడు బైక్‌పై వెళుతున్న యువకుడిని వెనుక నుంచి కర్నాటకకు చెందిన కంటైనర్ లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై సురేష్ తెలిపిన సమాచారం మేరకు.. పొట్టిపాడు గ్రామానికి చెందిన కాటూరి సురేష్ (35) తాపీమేస్త్రీగా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం దావాజీగూడెంలో ఉంటున్న అతని సోదరి దగ్గరకు వచ్చారు. పని ముగించుకుని తిరిగి ఇంటికి వెళుతుండగా చిన అవుటపల్లి సమీపంలో బైక్‌పై వెళుతున్న అతనిని లారీ వెనుక నుంచి ఢీకొట్టి అతనిపై నుంచి వెళ్లిపోవటంతో శరీరం అంతా నుజ్జునుజ్జు అయ్యి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కొనకళ్లతోనే ఆర్టీసీ అభివృద్ధి

తెలుగు మహిళా నేత సాయికల్యాణి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 30 : ఏపీ ఎస్‌ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడిగా పనిచేసిన కొనకళ్ల నారాయణ ఆర్టీసీ అభివృద్ధిపై అవగాహన కలిగి ఉన్నారని, ఆయనతోనే ఆర్టీసీ లాభాల బాటలో పయ నిస్తుందని తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయి కల్యాణి అన్నారు. బందరులోని కొనకళ్ల నివాసంలో సోమవారం మార్యద పూర్వకంగా కలిసి శుభాభినందనలు తెలిపి, కొనకళ్ల సోదరులను సన్మానించారు.



కొనకళ్ల సోదరులను సన్మానిస్తున్న సాయి కల్యాణి

కొనకళ్ల కృషి మరువలేనిది

డాక్టర్ మాకాల సత్యనారాయణ

పెనమలూరు, సెప్టెంబరు 30 : ఆక్యుపంక్చర్ వైద్యానికి కేంద్ర ప్రభుత్వ గుర్తింపు రావడానికి ప్రధాన కారకులైన మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణకు సోమవారం ఆక్యుపంక్చర్ ప్రముఖ వైద్యులు డాక్టర్ మాకాల సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. బందరులోని కొనకళ్ల నివాసంలో ఆయనను కలిసి ఆక్యుపంక్చర్‌కు కేంద్రప్రభుత్వం ఇచ్చిన గుర్తింపులో కొనకళ్ల పాత్రను శ్లాఘించారు. ఈ సందర్భంగా ఆక్యుపంక్చర్ వైద్యులు మాకాల మాట్లాడుతూ, దేశ ఆక్యుపంక్చర్ ప్రాక్టీషనర్స్ తరపున మాజీ ఎంపీలు కొనకళ్ల నారాయణ, డాక్టర్ పండుల రవీంద్రబాబు, అప్పటి కేంద్ర మంత్రి సుజనా చౌదరి, వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఎంటీ కృష్ణబాబుకు ఆక్యుపంక్చర్ వైద్యులందరూ రుణపడి ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నీకే రాజు, ఉన్ని శ్రీకుమార్, డెబానిస్ భక్షి, బాలచంద్రనాయర్, ఆయనవిల్లి ఉదయభాస్కర్ పాల్గొన్నారు.

పుస్తకాలే ఉత్తమ మిత్రులు

ఎనికేపాడు, సెప్టెంబరు 30 : జ్ఞానసముపార్జన పెంపొందించే పుస్తకాలే ఉత్తమ మిత్రుల వంటివని విజయ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంగ్లీష్ అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీలక్ష్మి అన్నారు. సోమవారం ఎనికేపా డులోని ఎస్‌ఆర్‌కే ఇంజినీరింగ్ కళాశాలలో పుస్తక సమీక్షకుల సంఘం సమావేశం నిర్వహించారు. కళాశాల ప్రథమ సీఎస్‌ఈ విద్యార్థిని పి. గీతికా, గుడ్‌వైబ్స్, గుడ్ లైఫ్ పుస్తకాన్ని సమీక్షించి, సానుకూల భావజాలాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ, మంచి పుస్తకాల పఠనం తెలియని ఎన్నో విషయాలపై అవగాహన పెంపొందిస్తుందన్నారు. గ్రంథాలను విద్యార్థులు చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి బొర్రా ప్రసాద్, హ్యూమానిటీస్ విభాగాధిపతి జార్ మురళీకృష్ణ, సాహిత్య క్లబ్ సమన్వయకర్త సుజిత్, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్ని మతాలను గౌరవించాలి

కంకిపాడు, సెప్టెంబరు 30 : అన్ని మతాలను గౌరవించాల్సిన అవసరముందని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అంటుంటే ఆయనను ప్రతిపక్ష పార్టీ నాయకులు విమర్శించటం సిగ్గుచేటని జనసేన ప్రచార కమిటీ జిల్లా కో-ఆర్డినేటర్ పులి కామేశ్వరరావు అన్నారు. స్థానిక విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడుతూ, గత ఐదేళ్ల వైసీపీ పాలనలో దేవాలయాలపై దాడులు జరిగాయన్నారు. దేవతామూర్తుల విగ్రహాలను ధ్వంసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా శ్రీవారి లడ్డూపై జరుగుతున్న అపచారాన్ని అడ్డుకోవాల్సింది పోయి ప్రతిపక్ష పార్టీ నాయకులు ప్రతివిమర్శలకు దిగడం సరికాదన్నారు.

టీడీపీ నేత భూషయ్యకు పరామర్శ

గండిగుంట(ఉయ్యూరు), సెప్టెంబరు 30 : టీడీపీ నేత వల్లభనేని నాగభూషణరావు(భూషయ్య)ను ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే బోడె ప్రసాద్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ సోమవారం పరామర్శించారు. నాగభూషణరావు తల్లి సత్యనాగ భానుమణి ఇటీవల మృతి చెందారు. గ్రామానికి వచ్చిన నాయకులు నాగభూషణరావు, ఆయన సోదరుడు చంద్రశేఖర్‌ను కలిశారు. సత్యనాగ భానుమణి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. దండమూడి చౌదరి వారి వెంట ఉన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు ప్రాధాన్యం ఇవ్వాలి

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, సెప్టెంబరు 30 : కృష్ణాజిల్లాలో ప్రధాన మార్గమైన బందరు రోడ్డులో ట్రాఫిక్ నియంత్రణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కృష్ణాజిల్లా ఎస్పీ గంగాధర రావును కోరారు. సోమవారం బందరు రోడ్డులోని తాడిగడప కూడలిలో నూతనంగా నిర్మించిన ట్రాఫిక్ అవుట్‌పోస్టును ప్రారంభించే కార్యక్రమంలో ఎస్పీతో కలిసి పాల్గొని మాట్లాడారు. ముఖ్యంగా తాడిగడప సెంటర్లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుతో పాటు కామయ్యతోపు, టైం ఆసుపత్రి, పోరంకి, పెనమలూరు, గంగూరు సెంటర్లలో గతంలో ఎన్నడూ లేని విధంగా ట్రాఫిక్ పెరిగిపోయిందని, ట్రాఫిక్ నియంత్రణకు పోలీసు శాఖ తరపున తగు చర్యలు అత్యవసరమే చేపట్టాలని కోరారు.బందరు రోడ్డులో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రణాళికలు తయారు చేస్తున్నామని ఎస్పీ తెలిపారు. పెనమలూరుకు పూర్తిస్థాయి ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌ను అందుబాటులోకి తేవడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, త్వరలోనే సానుకూల సంకేతాలు అందే అవకాశాలు ఉన్నట్లు ఆశాభావం వ్యక్తం చేశారు. అవుట్ పోస్టు నిర్మాణంలో సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ముందుగా తాడిగడప కూడలిలోని ట్రాఫిక్ అవుట్ పోస్టును ఎస్పీ గంగాధరరావు, ఎమ్మెల్యే బోడె ప్రసాద్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడె, ఎస్పీ గంగాధర్‌రావులను పోలీసు శాఖ సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు, సీఐలు వెంకటరమణ, టీవీవీ రామారావు, వెంకటనారాయణ, మురళీ కృష్ణ, పెద్దిరాజు, ఎస్ఐ టీవీ రమణ, టీడీపీ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకరబాబు, మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్ ప్రసాద్, తుమ్మల రాంకుమార్, పోలవరపు బాబీ, మురళి, చంటి పాల్గొన్నారు.



పోలీసు అవుట్ పోస్టు ప్రారంభం వద్ద ఎస్పీ, ఎమ్మెల్యేలను సన్మానిస్తున్న స్థానిక నాయకులు

రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఉయ్యూరు సర్కిల్‌లో కలపాలి..



రూరల్ పోలీస్‌స్టేషన్‌ను ఉయ్యూరు సర్కిల్‌లో కలపాలని ఎస్పీని కోరుతున్న సర్పంచ్‌లు

ఉయ్యూరు : ఉయ్యూరు రూరల్ పోలీస్ స్టేషన్ కంకిపాడు సర్కిల్ పరిధిలో ఉండటం వల్ల మండల గ్రామాల ప్రజలకు అసౌకర్యం కలుగు తుందని పలు గ్రామాల సర్పంచ్‌లు, టీడీపీ నాయకులు జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావుకు సోమవారం విన్నవించారు. టీడీపీ ప్రభుత్వ పాలనలో కాకాని నగర్ సమీపాన నిర్మించతలపెట్టిన రూరల్ పోలీస్ స్టేషన్, సీఐ కార్యాలయ భవన నిర్మాణం వైసీపీ పాలనలో నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న ఎస్పీ వాటిని పరిశీలించేందుకు వచ్చారు. ఆయనను జబర్లపూడి, సాయిపురం సర్పంచ్‌లు సూరపనేని ప్రసాద్, జాన్‌బాషా, మండల టీడీపీ అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు, కాటూరు నాయకుడు హరీశ్ తదితరులు కలసి రూరల్ స్టేషన్‌ను ఉయ్యూరు సర్కిల్‌లో కలపాలని కోరారు. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి త్వరలో అందరికి ఆమోదయోగ్యంగా నిర్ణయం తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు.

గ్రామంలోనే పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలి

టీడీపీ పోల్ మేనేజ్‌మెంట్ కో-ఆర్డినేటర్ ఆళ్ల గోపాలకృష్ణ

గన్నవరం, సెప్టెంబరు 30 : ఓటర్లకు పోలింగ్ కేంద్రం అందుబాటులో ఉండాలని, గ్రామంలోనే పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని టీడీపీ పోల్ మేనేజ్‌మెంట్ కో-ఆర్డినేటర్ ఆళ్ల గోపాలకృష్ణ కోరారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ 2025లో భాగంగా నియోజకవర్గ స్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. సమావేశానికి నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి షేక్ షహీద్‌బాబు హాజరయ్యారు. ఆళ్ల మాట్లాడుతూ, బాపులపాడు మండలం రంగయ్య అప్పారావుపేట పంచాయతీలో 610 మంది ఓటర్లు ఉన్నారని 5కిలో మీటర్లు దూరంలో ఉన్న కాకులపాడు వెళ్లి ఓటు వేయాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే ప్రసాదంపాడులో 888 మంది ఓటర్లు ఉన్నారని, వీరు మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న పోలింగ్ కేంద్రంలో ఓటు వేస్తున్నారని వివరించారు. అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దార్ కె.వి.శివయ్యకు అందజేశారు. బీజేపీ నేత నాదిండ్ల మోహన్, టీడీపీ నాయకుడు తంగిరాల శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్‌లు గోపాల్‌రెడ్డి, భవాని పాల్గొన్నారు.



తహసీల్దార్ శివయ్యకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి



బాపులపాడు జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థుల ప్రదర్శించిన కళాకృతులను పరిశీలిస్తున్న ఎంఈవోలు

హనుమాన్‌జంక్షన్,సెప్టెంబరు 30 : విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు పాఠశాలల్లో ఉపాధ్యాయులు నిరంతరం కృషి జరపాలని బాపులపాడు ఎంఈవో రాంబాలసింగ్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు సోమవారం వేస్ట్ టు ఆర్ట్ కాంపిటీషన్ కార్యక్రమాన్ని బాపులపాడు జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించారు. ఎంఈవో-2 సురేష్‌కుమార్ పోటీల్లో పాల్గొన్న విద్యా ర్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం చలపతి, రేమల్లె, బాపులపాడు జడ్పీ హైస్కూల్స్ ఉపాధ్యాయులు జి.శ్రీనివాసరావు, ఎస్.లక్ష్మీనాంచారమ్మ, టి.గిరిజారమణ పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకు ఎగ్జిబిషన్లు దోహదం

ఉంగుటూరు : విద్యార్థుల ఆలోచనలకు మరింత పదునుబెట్టి వారిలో అంతర్లీనంగా దాగివున్న సృజనాత్మకతను వెలికితీసేందుకు పాఠశాలల్లో నిర్వహించే కళాత్మక ప్రదర్శన(ఎగ్జిబిషన్లు)లు ఎంతగానో దోహదపడతాయని ఎంఈవో-2 జె.సాంబశివరావు అన్నారు. వేస్ట్ టు ఆర్ట్ కార్యక్రమంలో భాగంగా వివిధ రకాల వ్యర్థాలతో విద్యార్థులు తయారుచేసిన పలు డిజైన్లతో కూడిన కళాకృతుల ప్రదర్శన సోమవారం స్థానిక జడ్పీహైస్కూల్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం చోరగుడి అనిత, పులి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మమతల పందిరి ఆత్మీయ సమ్మేళనం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 30 : గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తూ, చిన్నారులకు ఓణీలు, పంచెలు వేడుకగా చేస్తూ మమతలపందిరి సేవా సమితి ఆత్మీయ సమ్మేళనం ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించారు. వేలేరులోని వంగలవారి కళ్యాణమండపంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన మమతపందిరి సేవా సమితి 3వ ఆత్మీయ సమ్మేళనంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి బాలవర్ధనరావు ముఖ్యఅతిథిగా హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. గత సేవా కార్యక్రమంలో సీమంతాలు నిర్వహించిన మహిళలకు, చిన్నారులకు నూతన వస్త్రాలను సేవాసమితి నిర్వాహకుడు లంక రమేష్ ఆధ్వర్యంలో సభ్యులు అందజేశారు.



సామూహిక సీమంతాలు, చిన్నారులకు ఓణీల వేడుకలో మమతల పందిరి సేవాసమితి సభ్యులు

విద్యార్థులు సేవాదృక్పథం అలవర్చుకోవాలి



పిన్నమనేని ఆస్పత్రి వద్ద లెర్నింగ్ ప్రోగ్రాంలో పాల్గొన్న విద్యార్థులు

గన్నవరం, సెప్టెంబరు 30 : విద్యార్థి దశలోనే సేవా దృక్పథం అలవర్చుకోవాలని నెహ్రూ యువకేంద్రం జిల్లా యూత్ ఆఫీసర్ సుంకర రాము అన్నారు. మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో నెహ్రూ యువకేంద్రం, కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో హాస్పిటల్ ఎక్స్‌పీరియన్స్ లెర్నింగ్ ప్రోగ్రాంలో భాగంగా ఒరింటేషన్, 13 మంది విద్యార్థులతో హాస్పిటల్‌లోని వివిధ విభాగాల్లో సోమవారం పనిచేయించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి డాక్టర్ ప్రణీత్, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ బి.వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సేవాకార్యక్రమాల్లో టీడీపీ ముందంజ

ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర

గండిగుంట(ఉయ్యూరు), సెప్టెంబరు 30 : సేవా కార్యక్రమాల్లో టీడీపీ ముందంజలో ఉంటుందని, డీజేఆర్ మెమోరియల్ ద్వారా తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి చేస్తున్న సేవలు అభినందనీయమని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర కొనియాడారు. గండిగుంటలోని గణపతి సచ్చిదానంద జ్ఞాన బోధసభ అవరణలో సోమవారం డీజేఆర్ మెమోరియల్ దండమూడి చౌదరి ఆధ్వర్యంలో చేపట్టిన 150 కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మట్లాడూతూ, కుట్టుమిషన్ల ద్వారా మహిళల కుటుంబాలకు ఆర్థిక స్వాలంబన సాధ్యపడుతుందన్నారు. కుట్లు, అల్లికల ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొంది కుటుంబ పోషణలో భాగస్వాములు అవడం సంతోషకరమని మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ అన్నారు. సేవా కార్యక్రమాలు చేస్తున్న దండమూడి చౌదరికి రాజకీయ భవిష్యత్తు ఉంటుందని, అందుకు తనవంతు సాయం అందిస్తానన్నారు. కుట్టు మిషన్లు సద్వినియోగం చేసుకుని మహిళలు కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ట్రస్టు ద్వారా చిరువ్యాపారులకు తోపుడు బండ్లు, బడ్డీలు అందజేసి వారి ఉపాధికి తోడ్పడడం అభినందనీయమన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు, యెనిగళ్ల కుటుంబరావు, కార్యదర్శి కాటూరు శరత్, పార్టీ నాయకులు గుర్నాధం, జంపాన పూర్ణచంద్రరావు, పి.శ్రీనివాసరావు, బాబి, సాంబశివరావు, పలువురు కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.



మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీలో మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే బోడె ప్రసాద్, కొనకళ్ల



సభలో మాట్లాడుతున్న కేడీసీసీ బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి హరనాథ్‌బాబు

రైతు కుటుంబాల అభ్యున్నతే లక్ష్యం

కేడీసీసీ బ్యాంకు జిల్లా పర్సన్ ఇన్‌చార్జి హరనాథ్‌బాబు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 30 : రైతు కుటుంబాల అభున్నతే లక్ష్యంగా సహకార సంఘాల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలను అందుబాటులోకి తెచ్చాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కేడీసీసీ బ్యాంకు జిల్లా పర్సన్ ఇన్‌చార్జి హరనాథ్‌బాబు తెలిపారు. రంగన్నగూడెం పీఏసీఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మహజన సభలో ఆయన పాల్గొన్నారు. సహకార సంఘాల్లో సభ్యులైన వారి కుటుంబాల్లోని విద్యార్థులకు విదేశాల్లో ఉన్నత విద్యకు రుణాలు అందించాలని రైతులు కోరారు. రైతుల వినియోగం కోసం సంఘ పరిధిలోని సింగన్నగూడెంలో 50మెట్రిక్‌టన్నుల గోడౌన్ నిర్మించాలని, సంఘ అభివృద్ధికి దాతలు విరాళంగా ఇచ్చిన రూ.7.7లక్షల నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలని, స్థల దాత ఆళ్ల రామయ్యభవన్‌గా పీఏసీఎస్ భవనానికి నామ కరణం చేయాలని ఆళ్ల గోపాలకృష్ణ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సంఘ పరిధిలో శాశ్వత ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని, రైతులకు గ్రామీణ ప్రాంతాల్లో గృహనిర్మాణానికి రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కసుకుర్తి రంగామణి కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు తుమ్మల దశరథరామయ్య, పాలసొసైటీ అధ్యక్షుడు మొవ్వా శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, టీడీపీ అధ్యక్షులు మొవ్వా వేణుగోపాల్, కొండపల్లి వెంకన్న, మైనేని కృష్ణారావు, దోనవల్లి హరిబాబు, తుమ్మల సత్యనారాయణ, మొక్కపాటి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సహాయ కిట్లు పంపిణీ



పెనమలూరు, సెప్టెంబరు 30 : పెనమలూరు గ్రామ పేరంటాళ్ల చెరువు వద్ద వరదకు మునిగిన షుమారు వంద కుటుంబాలకు నిత్యావసర సరుకులతో కూడిన కిట్లను సోమవారం పంపిణీ చేశారు. నెస్లే కంపెనీ వారి సౌజన్యంతో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన పంపిణీ కార్యక్రమంలో డీటీ భవాని, భరద్వాజ, రమేష్, మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్, తోటకూర ఉదయభాస్కర్, కిలారి శ్రీనివాసరావు, మట్టపర్తి బుజ్జి, యలమంచిలి ప్రసాద్, పాముల బలరాం తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా

• మచిలీపట్నం • పెడన • గుడివాడ • పామర్రు • అవనిగడ్డ

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	123, 132, 143
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.535

ఉపాధి పనులు సక్రమంగా జరపాలి

పెడన రూరల్ : ఉపాధి హామీ పనులు సక్రమంగా చేస్తే అందరికీ పని లభించడంతో పాటు గ్రామాలు అభివృద్ధి చెందుతాయని డ్వామా ఏవో నాగేశ్వరరావు అన్నారు. ఉపాధి పనుల సామాజిక తనిఖీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ 7.40 కోట్లతో 1221 పనులు చేపట్టారన్నారు. హాజరు పట్టీలో దిద్దుబాటులను ఆడిట్ బృందాలు తప్పు పట్టాయి. పనులు జరిగిన చోట్ల బోర్డులు లేవని, ఆడిట్ సమయంలో ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు హాజరు కాలేదని బృందం తెలిపింది. రూ1.5 లక్షల రికవరీకి ఆదేశించారు. ప్రాజెక్టు విజిలెన్స్ ఇంజనీర్ సురేష్‌కుమార్, స్టేట్ రిసోర్స్‌పర్సన్ సత్యనారాయణ, ప్రోగ్రామ్ మేనేజరు ఈశ్వర్, ఎంపీడీవో రెడ్డయ్య, ఏఈ హరిబాబు, ఏపీవో వజీర్, ముత్యాలు ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

సాహితీవేత్త అనిల్‌కుమార్‌కు జాషువా పురస్కారం



గుడివాడ : సామాజిక అసమానతలపై కలం ఝుళిపించిన నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా అని పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ దివాకర్ అన్నారు. వీర బ్రహ్మేంద్ర స్వామి దేవస్థానంలో తెలుగు భాషా వికాస సమితి ఆధ్వర్యంలో గుర్రంజాషువా 129వ జయంతిని సోమవారం నిర్వహించారు. మాచర్లకు చెందిన సాహితీవేత్త డి.అనిల్‌కుమార్‌కు గుర్రం జాషువా సాహితీ స్ఫూర్తి పురస్కారం-2024 ప్రదానం చేశారు. తొలుత జాషువా చిత్రపటానికి నివాళులర్పించారు. గాంధీబాబు, ఇశ్రాయేలు, డిఆర్‌బి ప్రసాద్, సాహితీవేత్తలు మోకా మాధవరావు, ఆనందమోహన్ బోసు, చింతలూరి సత్యనారాయణ, రూప, గోవర్ధనరావు, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, రామకృష్ణ, సత్యనారాయణ, బసవేశ్వరరావు, సాంబశివరావు, రామారావు, వంగా శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజలందరికీ కొండాలమ్మ ఆశీస్సులు



దసర ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ/గుడ్లవల్లేరు : వేమవరం కొండాలమ్మ ఆలయంలో అక్టోబరు 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరిగే శ్రీదేవి శరన్నవరాత్ర మహోత్సవాల వాల్ పోస్టర్‌ను రాజేంద్రనగర్‌లోని స్వగృహంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆవిష్కరించారు. కొండాలమ్మ ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు, టీడీపీ నాయకులు వాసే మురళీ, దానేటి సన్యాసిరావు, చేకూరు జగన్మోహనరావు, పెద్దు వీరభద్రరావు, వేదపండితులు, దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వభారతి విద్యార్థుల ప్రతిభ



గుడివాడ : గుడివాడ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన రోటరీ యువజనోత్సవాల్లో తొమ్మిది కేటగిరిల్లో జరిగిన ప్రతిభా పాటవ పరీక్షల్లో విశ్వభారతి పాఠశాల విద్యార్థులు ప్రతిభను చాటి బహుమతులు సాధించినట్లు పాఠశాల ఛైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ తెలిపారు. బహుమతులు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

జనసేన అభిమాని మణికంఠకు ఎమ్మెల్యే కాగిత నివాళి



గూడూరు : కప్పలదొడ్డి గ్రామానికి చెందిన జనసేన పార్టీ వీరాభిమాని జంపాన మణికంఠ సోమవారం మృతి చెందాడు. మణికంఠ భౌతికకాయాన్ని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ సోమవారం సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మణికంఠ కుటుంబానికి టీడీపీ, జనసేన పార్టీలు ఎప్పుడూ అండగా ఉంటాయన్నారు. కూటమి నాయ కులు పంచకర్ల సురేష్, పోతన స్వామి, దాసరి ఉమాసాయిరామ్, కట్టా మునీశ్వ రరావు, తలుపుల వెంకటకృష్ణారావు, ఎస్ఏ బేగ్, సిరివెళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాతం అంబేడ్కర్



గుడివాడ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచన విధానం ప్రతి ఒక్కరికీ మార్గదర్శకం కావాలని వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. రాజేంద్రనగర్‌లోని అంబేడ్కర్ మెమోరియల్ భవనంలో అంబేడ్కర్ గుడివాడలో పర్యటించి 78 వసంతాలు పూర్తైన సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి సీఐ శ్రీనివాస్ తదితరులు పూలమాలలు వేసి నివాళుల లర్పించారు. ఆదిమాంధ్ర సంఘం జిల్లా అధ్యక్షుడు జయరాజు, కిరణ్, ప్రభాకర్, నాగేంద్ర, బొడ్డు విల్సన్, సువర్ణరాజు, కోటిబాబు, విజయ్, కరుణాకర్, నీలాకాంత్, సురేష్, జోషి పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో మౌలిక వసతుల కల్పనకు కృషి



పాఠశాల భవనం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎన్ఆర్ఐ గొర్రెపాటి రంగనాథ్‌బాబు

ఘంటసాల : ఘంటసాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎన్ఆర్ఐ గొర్రెపాటి రంగనాథ్ బాబు పేర్కొన్నారు. ఘంటసాలలో రూ.75 లక్షలతో నిర్మించిన యు.వి.ఆర్ స్కూల్ భవనం మొదటి బ్లాక్‌ను సోమవారం రంగనాథ్‌బాబు ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. డాక్టర్ వేమూరి ప్రమోద్ కుమార్ పీహెచ్‌సీలో సౌకర్యాలు కల్పించాల్సిందిగా కోరగా, రంగనాథ్‌బాబు స్పందించి హామీ ఇచ్చారు. గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే ఉద్దేశ్యంతో పాఠశాలను ఏర్పాటు చేసినట్లు రంగనాథ్ బాబు తెలిపారు. జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, గొర్రెపాటి ఫౌండేషన్ ప్రతినిధి కొండపల్లి రామకృష్ణ, ప్రిన్సిపాల్ లోయ నాగేశ్వరరావు, విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకట నరసింహారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగులకు సత్కారం



ఘంటసాల : ఉత్తమ సేవలు అందిస్తే ప్రజా మన్ననన లభిస్తుందని వక్తలు పేర్కొన్నారు. బదిలీపై వెళ్తున్న ఈవోపీఆర్డీ గుత్తికొండ కిషోర్, పంచాయతీరాజ్ ఏఈ నాగేశ్వరరావు, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరావు,పలువురు కార్యదర్శులను మండల కార్యాలయంలో ఎంపీపీ వేమూరి రజనీ కుమారి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. జడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ, మాజీ ఏఎంసీ ఛైర్మన్లు తుమ్మల చౌదరిబాబు, వేమూరి వెంకట్రావు, టీడీపీ నేత పరుచూరి సుభాష్ చంద్రబోస్, ఎంపిడివో డి.సుబ్బారావు, సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతం



మచిలీపట్నం టౌన్ : ప్రభుత్వం అందించే పోషకాహారం తీసుకుంటూ గర్భిణులు, బాలింతలు ఆరోగ్యవంతంగా ఉండాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖాధికారి సువర్ణ అన్నారు. నారాయణపురంలో సోమవారం పౌష్టికాహార ఉత్సవాలు జరిగాయి. గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. సీడీపీవో గ్లోరీ, సెక్టార్ సూపర్‌వైజర్ మాలతీదేవి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

హెచ్‌ఎం రావెళ్లకు సత్కారం



పెదపారుపూడి : ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా యలమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రావెళ్ల వరుణ్ కుమార్ దంపతులను పాఠశాల ఆవరణలో సోమవారం ఘనంగా సత్కరించారు. పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కుంపటి రాజేంద్ర ప్రసాద్, ఎంఈవో-1 బొడ్డు శ్రీనివాస్, ఎంఈవో-2 కొల్లూరు సురేష్, గ్రామసర్పంచ్ కొల్లూరు అనూష, పాఠశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కంభం కవిత, జుజ్జువరపు రాజు పాల్గొన్నారు.



వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న బండి రామకృష్ణ



గుడివాడలో సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 30 : ధర్మ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, అక్టోబరు 2న జిల్లా పరిషత్ సెంటర్ నుంచి కోనేరుసెంటర్ వరకు నిర్వహించనున్న ఆధ్యాత్మిక యాత్రను విజయవంతం చేయాలని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండి రామకృష్ణ పిలుపునిచ్చారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు సోమవారం దేవాలయాల్లో వీర మహిళలు, జనసైనికులు దీపారాధనలు చేశారు. గొడుగుపేట వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బండి రామకృష్ణ పూజలు చేయగా, మహిళలు దీపారాధన చేశారు. బండి రామకృష్ణ మాట్లాడుతూ, హిందూ ధర్మ పరిరక్షణ కోసం ధర్మ పరిరక్షణ మండలి బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేటర్లు అన్నం ఆనంద్, పినిశెట్టి నాగఛాయాదేవి, జనసేన నాయకుడు గడ్డం రాజు తదితరులు పాల్గొన్నారు.



కోడూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

కోడూరు : సనాతన ధర్మ పరిరక్షణ కొరకు కోడూరు మండల కూటమి నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు సోమవారం కోడూరు వెంకటేశ్వస్వామి దేవస్థానంలో ప్రత్యేక దీపారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అడుగడుగునా సనాతన ధర్మాన్ని అపహాస్యం చేశారని, సనాతన ధర్మాన్ని పరిరక్షించుకోవలసిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి కొండవీటి సునీత, యర్రంశెట్టి శ్రీదుర్గా, లంకే భాస్కరరావు, తోట సోమశేఖరరావు, యర్రంశెట్టి దామోదర్‌రావు, పూతబోయిన సీతారత్న సాయిబాబు, దాసరి వెంకట కృష్ణారావు, కాగిత రామారావు, బడే రాజశేఖర్, అడుసుమిల్లి రాము, పుషడపు భానుమూర్తి, కోట సాయిబాబు, దాసరి సాంబశివరావు, చందు రామాంజనేయులు, కోట వేణు తదితర నేతలు పాల్గొన్నారు.

ద్వారకా తిరుమలకు సైకిల్ యాత్ర

గుడివాడ : తిరుమల లడ్డూ అపవిత్రం నేపథ్యంలో గోకవరపు సునిల్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఆర్యవైశ్య కల్యాణమందిరం సమీపంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానం నుంచి ద్వారకా తిరుమలకు చేపట్టిన సైకిల్‌యాత్రను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము జెండా ఊపి ప్రారంభించారు. కూటమి నాయకులు మురళీ, సురేంద్రబాబు, వేణుబాబు, ఆర్యవైశ్య ప్రముఖులు సామి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కూరాడ రామాలయంలో దీపారాధన



గుడ్లవల్లేరు : డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు సోమవారం రాత్రి జనసేన పార్టీ ఆధ్వర్యంలో కూరాడ లాక్‌డౌన్ రామాలయంలో దీపార్చన నిర్వహించారు. ప్రత్యేక పూజలు జరిపారు. జనసైనికులు, వీరమహిళలు ఓంకార రూపంలో దీపాలను వెలిగించారు. చిలంకుర్తి అశ్విని, సమ్మెట సాంబయ్య, గాళ్ళ గణేష్, కాడిచర్ల కిరన్, వెన్నా ముళి, రత్తయ్య,గవిరి రత్నారావు తదితరులు పాల్గొన్నారు.

అవనిగడ్డ రూరల్ : మోదుమూడిలో జనసేన గ్రామ పార్టీ అధ్యక్షులు బచ్చు వెంకట నారాయణ ఆధ్వర్యంలో లక్ష్మీనారాయణ స్వామి దేవాలయం, రామాలయం, ప్రసన్న ఆంజనేయ స్వామి దేవాలయం, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయాలను శుభ్రం చేసి, ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ బచ్చు బేబీ, కూటమి నాయకులు బచ్చు రఘునాథ్ ప్రసాద్, ఘంటసాల రాజమోహనరావు, బచ్చు శ్రీహరి, మురళీకృష్ణ, శ్రీనివాసరావు, సనకా రామలక్ష్మి, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని గ్రామంలో నగర సంకీర్తన, ఆలయాల్లో భజనలు నిర్వహించారు.

మోపిదేవి : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ఆవరణను శుభ్రం చేశారు. ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు, ఉద్యోగులు శుభ్రపరిచారు. బొప్పన సత్యనారాయణ, ఆలయ ఉద్యోగులు క్రమంలో పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓట్ల నమోదు

అవనిగడ్డ : నియోజకవర్గంలోని పట్టభద్రులంతా తమ ఓటును నమోదు చేయించుకోవాలని జనసేన నేత మండలి వెంకట్రామ్ పిలుపునిచ్చారు. బుద్ధప్రసాద్ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఓట్ల నమోదు కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. మండలి వెంకట్రామ్ తన ఓటు నమోదు దరఖాస్తును నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు పరిశీలకులు రావి సూర్య చరణ్ తేజ్‌కు అందజేశారు. పరిశీలకులు ముళ్లపూడి వెంకట్, రాయపాటి శ్రీనివాసరావు, రావి రత్నగిరి, కోనేరు చంద్రమౌళి, బి.రాంబాబు, ఘంటసాల రాజమోహనరావు, ముళ్లపూడి శ్రీను, భోగిరెడ్డి బుజ్జిబాబు, గుడివాక నరహరి, కోట సాయికృష్ణ, తండు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ కార్యవర్గం

అవనిగడ్డ : యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు గా కూనపరెడ్డి జీవేంద్ర రావు, బండ్రెడ్డి శివరామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలో మండల శాఖను ఎంపిక చేశారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.కనకరావు, యూటీఎఫ్ నేతలు పాల్గొన్నారు.

నందివాడ తహసీల్దార్‌గా గురుమూర్తిరెడ్డి

నందివాడ : నందివాడ తహసీల్దార్‌గా గురుమూర్తి రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. నందివాడ తహసీల్దార్‌గా ఉన్న రామానాయక్ సెలవులో ఉన్నారు. పశ్చిమ గోదావరి తహసీల్దార్‌గా ఉన్న ఆయనకు నందివాడ బాధ్యతలు అప్పగించారు.

ఇళ్లకు నష్టపరిహారం జమ

కూచిపూడి : ముంపుబారిన పడిన ఇళ్లకు ప్రభుత్వం రూ.10 వేల చొప్పున నష్ట పరిహారం అందజేసినట్లు తహసీల్దార్ కె.మస్తాన్‌రావు తెలిపారు. చిన్నముత్తేవిలో 33, నిడుమోలులో 13, కాజలో 21, కూచిపూడిలో మూడు, భట్లపెనుమర్రులో రెండు, మంత్రిపాలెంలో 11, యద్దనపూడిలో ఒకటి ఇళ్లకు పరిహారం అందిందన్నారు.

హోమియో వైద్యశిబిరం

చల్లపల్లి : చల్లపల్లి వాసవీక్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ మణికంఠ వైద్యసేవలందించారు. 50 మందిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. దింటకుర్తి జ్యోతి, సత్యవాణి, కుసుమ, శ్రీదేవి, ద్రోణ పూర్ణచంద్రరావులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఐవీఎం బాసట



చల్లపల్లి : వరద బాధితులకు పురిటిగడ్డ ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో దుప్పట్లు, దుస్తులను పంపిణీ చేశారు. బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం పెదలంకకు చెందిన 520 మంది వరద బాధితులకు రూ.5.20 లక్షల వ్యయంతో దుప్పట్లు, చీరలు, లుంగీలు, టవల్స్‌ను ఐవీఎం డైరెక్టర్ డా.వేములపల్లి సురేష్ - రోజా దంపతులు పంపిణీ చేశారు. వేములపల్లి విజయ, పాస్టర్ జాన్‌పాల్ పాల్గొన్నారు.

కిడ్నీ బాధితునికి రూ.50 వేల సాయం



చల్లపల్లి : చల్లపల్లికి చెందిన కిడ్నీ బాధిత అబ్దుల్ సుభాన్‌కు హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ ఎహియా రూ.50 వేలు ఆర్థిక సహాయం అందించారు. చల్లపల్లి గ్రామానికి చెందిన ఎహియా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. తండ్రి మహమ్మద్ ఇలియాస్ ద్వారా విషయం తెలుసుకుని తనవంతు సాయంగా సుభానీకి అందించారు.

గోతులు పూడ్చిన కూచిపూడి గ్రామస్థులు



కూచిపూడి : కూచిపూడి - బార్లపూడి రహదారిలోని సిద్దేంద్ర కళాపీఠం, జడ్పీ హైస్కూల్, కో- ఆపరేటివ్ బ్యాంక్ సమీపంలో ఏర్పడిన భారీ గోతులను గ్రామస్థుల ఆర్థిక సహకారంతో సోమవారం పూడ్చారు. రహదారులు చెరువులుగా మారి ప్రమాదాలు జరిగి అనేక మంది వాహనదారులు గాయపడ్డారు. సోమవారం గాజుల వ్యాపారి ఆ రహదారిలో ప్రయాణిస్తూ వాహనంతో సహా పడిపోవటంతో గాయపడ్డారు. స్వచ్ఛందంగా గోతులు పూడ్చటం పట్ల పలువురు అభినందించారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య శిబిరం

పెడన : స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా పురపాలక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో పారిశుధ్య కార్మికుల కోసం సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. పారిశుధ్య కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

ప్రవక్త చూపిన మార్గం అనుసరణీయం

పామర్రు : మహమ్మద్ ప్రవక్త చూపిన మార్గం అనుసరణీయమని ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అన్నారు. గఫార్ సెంటర్లో ఆదివారం రాత్రి ప్రవక్త జన్మదిన వేడుకల్లో భాగంగా మత గురువు అబ్దుల్ ఉమ్రీ అధ్యక్షతన మిలాద్ ఉన్ నబీ బహిరంగ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కుమార్ రాజా పాల్గొన్నారు. రాష్ట్ర ఇస్లామీక్ హింద్ అధ్యక్షుడు మొహమ్మద్ రఫీక్, బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు బేతనబొట్ల సుబ్బారావు, ఆరిఫ్, ముస్తాఫా, ముస్తాఖీ, యూనస్, ఇస్మాయల్‌తదితరులు పాల్గొన్నారు.

ఆటో చోరీ..గంటన్నరలో పట్టివేత

కూచిపూడి : కూచిపూడి పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం ఆటో దొంగతనం జరిగింది. అయ్యంకి గ్రామానికి చెందిన పడమట నాగరాజు ఆటో రోడ్డు పక్కన పెట్టి పొలం వెళ్లి తిరిగి వచ్చేసరికి ఆటో కనిపించలేదు. పోలీస్ స్టేషన్‌కు వచ్చి రిపోర్ట్ చేయగా, కేసు నమోదు చేసి ఎస్సై ఎం.సుబ్రహ్మణ్యం గంటన్నర వ్యవధిలోనే ఆటోను రికవరీ చేశారు. మూడు బృందాలు పామర్రు గ్రామా నికి చెందిన గండ్రెడ్డి శివ అనే వ్యక్తి దొంగిలించాడని తెలుసుకుని ఆటో రికవరీ చేసినట్లు ఎస్సై సుబ్రహ్మణ్యం తెలిపారు.

మత్స్యశాఖ కమిషనర్ వస్తే సమాచారం ఇవ్వకపోవడంపై మత్స్యకార నేతల ఆగ్రహం

నాగాయలంక : మత్స్య శాఖ కమిషనర్ ఆదివారం నియోజకవర్గంలోని తీర ప్రాంత గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తే వివరాలను ముందుగా మత్స్యకార నేతలకు తెలపకపోవటం పట్ల ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ మత్స్యకారుల సేవా సమితి ప్రధాన కార్యదర్శి, టీడీపీ నేత లకనం నాగాంజనేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మత్స్యశాఖ ఉన్నతాధికారి నియోజకవర్గంలో పర్యటిస్తే మత్స్యశాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులకు, మత్స్యకార సంఘాల ప్రతినిధులకు గానీ సమాచారం ఇవ్వకపోవటంశోచనీయమన్నారు. జిల్లా మత్స్య సహకార సంఘం డైరెక్టర్ కర్రి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

క్రైస్తవ భవనాలను పట్టించుకోని జగన్ : ఐపీసీ ధ్వజం

మచిలీపట్నం టౌన్ : క్రైస్తవుడని చెప్పుకుంటున్న మాజీ సీఎం జగన్‌మోహనరెడ్డి క్రైస్తవ భవనాలను పట్టించుకోకుండా ఏసుక్రీస్తును అవమానించారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్య దర్శి ఐపిసి కరుణకుమార్ విమర్శించారు. టీడీపీ కార్యా లయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గుంటూరులో నిర్మించిన క్రిస్టియన్ భవన్‌ను వైసీపీ పాలనలో పట్టించు కోలేదన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే నిధులు మంజూరు చేశారన్నారు. యు. సురేష్, వి.రమేష్, పి.పాల్, జి.నవమణిరాజు, కె.నాగేశ్వరరావు, బి.నారాయణ స్వామి, పి.జాషువా పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

నందివాడ (చేదుర్తిపాడు) : యాహరా సంస్థ అందించిన నిత్యావసర సరుకులను వరద బాధితులకు చేదుర్తిపాడులో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షులు దానేటి సన్యాసిరావు, జగన్మోహనరావు, యాహరా కంపెనీ ఉద్యోగులు వినయ్, ప్రభుకాంత్, రామకృష్ణారెడ్డి గ్రామస్థులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం విద్యార్థిని ప్రతిభ

ఘంటసాల : వక్తృత్వ పోటీల్లో శ్రీకాకుళం జడ్పీ పాఠశాల విద్యార్థిని టి.హన్సిక ఫణిదేవి ప్రథమ స్థానం సాధించింది. బందరులో ఎంఈవో తాహెరా సుల్తానా తదితరులు హన్సి కను అభినందించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు అనుపల్లవి భువనేశ్వరి, ఎంఈవో -1 శివశంకర్, ఎంఈవో-2 ఎండి.మోమిన్, వీర కోటేశ్వరరావు అభినందించారు.

కంప్యూటర్ ఆపరేటర్‌పై విచారణ జరిపించండి

కోడూరు : కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తూ మూడు పంచాయతీల జీతాన్ని పొందుతున్న శివపై విచారణ జరిపించాలని పాతూరి వెంకటేష్ ఎంపీడీవో శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు.

కుక్కల బెడద నివారించాలి

● పెడన కౌన్సిల్‌లో కౌన్సిలర్ల వినతి

పెడన : పట్టణంలో కుక్కల, ఆవుల బెడదను నివారించాలని 12, 21 వార్డుల కౌన్సిలర్లు మట్టా శివపావని, పిచ్చిక సతీష్ కోరారు. కుక్క కాటుకు గురై బాధితులు ఆసుపత్రుల పా లవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఛైర్‌పర్సన్ నాగకుమారి అధ్యక్షతన సోమవారం కౌన్సిల్ సమావేశం జరిగింది. కమిషనర్ ఎం.గోపాలరావు మాట్లాడుతూ, కుక్కల సంతానోత్పత్తి నిరోధానికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయిస్తామన్నారు. కౌన్సిలర్ గరికముక్క చంద్రబాబు మాట్లాడుతూ, వాహనాలకు రిపేర్లు చేయించే విషయంలో ఇంజనీరింగ్ అధికారులు నిబంధనలు పాటించడం లేదన్నారు. ఫలితంగా రిపేర్లు ఆలస్యమై పారిశుధ్య పనులకు ఆటంకం కలుగుతోందన్నారు. ట్రాక్టర్ల మరమ్మతులకు లక్షలాది రూపాయలు వెచ్చించే కంటే కొత్త ట్రాక్టర్లు కొనుగోలు చేయడమే మేలని ఆయన అభిప్రాయపడ్డారు. ఇప్పటి వరకు పనిచేసిన ఛైర్మన్ల చిత్ర పటాలను కౌన్సిల్ సమావేశపు హాలులో ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ కటకం ప్రసాద్ ప్రతిపాదించగా స్వాతంత్ర్య సమరయోధులు, సీఎం, డిప్యూటీ సీఎంల చిత్రపటాలను కూడా కౌన్సిల్ హాలులో ఏర్పాటు చేయాలని పావని సూచించారు. తామరచెరువుకు గట్లు నిర్మించి పంట పొలాలు ముంపునకు గురికాకుండా చూడాలని వైస్‌ఛైర్మన్ ఎండి ఖాజా కోరారు. చెరువులను సర్వే చేసి హద్దులను నిర్ణయిం చాలని, అనధికార లే అవుట్ల కు బోర్డులు ఏర్పాటు చేయాలని కటకం ప్రసాద్ కోరారు. బదిలీపై వచ్చిన ఉద్యోగులను ఛైర్‌పర్సన్ సభకు పరిచయం చేశారు. అజెండాలోని తొమ్మిది అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.

పీఏసీఎస్ నష్టానికి కారణాలు చెప్పాలి

● రావివారిపాలెం రైతుల నిలదీత

మోపిదేవి : అధికారుల తీరుపై రావివారిపాలెం పీఏసీఎస్ సర్వసభ్య సమావేశంలో రైతులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రత్యేకాధికారి సల్మాన్ సుల్తానా సయ్యద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో 2023-24 సంవత్సరానికి జమ ఖర్చులు, ఆడిట్ నివేదికను చదివి వినిపించారు. రూ.9లక్షల మేర నష్టాల్లో ఉన్నట్లు ప్రత్యేకాధికారి తెలియజేయటంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలోలాభాల బాటలో ఉన్న సంఘం వైసీపీ అధికారం చేపట్టిన ఐదేళ్లలో నష్టాలకు ఎలా వెళ్లిందో తెలియజేయాలని అధికారులను నిలదీశారు. సొసైటీ నిధుల నుంచి రూ.70 లక్షలలతో గోడౌన్‌ను నిరుపయోగమైన స్థలంలో ఎవరి అనుమతితో నిర్మించారని రైతులు ప్రశ్నించారు. సొసైటీలో జరిగిన అక్రమాలు, ఉద్యోగుల బాధ్యతారాహిత్యంపై జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని పంచాయతీ ఉపసర్పంచ్ కోనేరు సుందర్ సింగ్,రైతులు పరుచూరి శ్రీనివాసరావు, కంఠమనేని కుటుంబరావు తదితరులు హెచ్చరించారు. సమావేశం నిర్వహిస్తున్నట్లు సంఘ పరిధిలోని రైతులకు కనీస సమాచారం ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. సమావేశంలో పీఏసీఎస్ సీఈవో మోపిదేవి శ్రీనివాసరావు, సహాయక ఉద్యోగులు వెంకటేశ్వరరావు, రమేష్ తదితరులు ఉన్నారు.

యాసం చిట్టిబాబుకు మండలి పరామర్శ

అవనిగడ్డ : ఆదివారం అర్ధరాత్రి భట్టిప్రోలు మీదుగా అవనిగడ్డకు వస్తున్న మండల టీడీపీ అధ్యక్షుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ట్రాక్టర్ దూసుకురావటంతో దానిని తప్పించే క్రమంలో ప్రమాదం చోటు చేసుకుంది. వెంటనే రేపల్లెలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్సకు తరలించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఆయన కుమారుడు మండలి వెంకట్రావ్ తదితరులు పరామర్శించారు.